సాక్షి
కామారెడ్డి
గురువారం । 21 । ఆగస్టు । 2025



రైతులను ఆదుకుంటాం

వరదలతో ముంపునకు గురై, పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 8లో ▸



ఎకరాకు రూ. 50 వేలివ్వాలి

పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సురేందర్ డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /21.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఆహ్లాదక రమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'బాధ్యతగా పని చేయాలి'



బాన్సువాడ : ఆర్టీసీ ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలని ఆర్టీసీ ఈడీ సోలోమన్ సూచించారు. బుధవారం బాన్సువాడ డిపోను ఆయన సందర్శించి, సిబ్బంది, కార్మికులతో మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పని చేయాలని, ఖర్చులు తగ్గిస్తూనే ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఇందుకోసం కార్మికులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో ఆడిటింగ్‌కు వసూళ్లు!

- ఒక్కో స్కూల్ నుంచి రూ. ఐదొందలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ గ్రాంట్ల ద్వారా వచ్చే నిధుల వినియోగంపై నిర్వహించే ఆడిటింగ్‌కోసం వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆడిట్ చేయడానికి వచ్చే సిబ్బంది కోసమంటూ ప్రతి పాఠశాల నుంచి రూ.5 వందల చొప్పున మధ్యవర్తులు వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది. స్కూళ్లపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, చివరికి ఆడిటింగ్‌కు కూడా డబ్బులు వసూలు చేస్తున్న వ్యవహారంపై ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ కాంప్లెక్సుల వారీగా డబ్బులు వసూలు చేసి ఆడిటింగ్ సిబ్బందికి ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి వాటిని నిలువరించాల్సిన అవసరం ఉంది.

'అంబేడ్కర్ ఆశయాలను సాధించాలి'



దోమకొండ: ప్రతి ఒక్కరు అంబేడ్కర్ ఆశయాలను సాధించే దిశగా కృషిచేయాలని స్వేరోస్ ఫౌండర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం దోమకొండలో స్వేరోస్ నెట్‌వర్క్ వైస్‌చైర్మన్ దేవరగట్టు బాలప్రసాద్ తల్లి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతితో దేశం ముందంజ వేస్తుందన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ చైర్మన్ మామిడాల ప్రవీణ్‌కుమార్, ప్రతినిధులు దుర్గయ్య, బాల్‌రాజు, లక్ష్మణ్, రాజ్‌కుమార్, రాజు, రాములు, రవీందర, పాత రాము, మురళి తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి 'పనుల జాతర'

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి పనుల జాతరకు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది రూ. 2,523.17 కోట్లతో 3,347 పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందని డీఆర్‌డీవో సురేందర్ తెలిపారు. పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, ప్లాస్టిక్ వేస్టేజ్ యూనిట్‌ల ఏర్పాటు, రహదారుల నిర్మాణం, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం, మహిళా సంఘాలకు పశువుల కొట్టాలు, కోళ్ల, గొర్రెల షెడ్లు, బావుల తవ్వకం, వానపాముల ఎరువుల తయారీ, అజోల్లా పిట్‌లు, పండ్ల తోటల పెంపకంలాంటి పనులు చేపట్టనున్నామన్నారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రేపటి నుంచి పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

కారుచౌక మోసం



కేసు వివరాలు తెలుపుతున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర, పోలీసులు

మోసగాళ్లు తెలివిమీరుతున్నారు. జనాన్ని మోసం చేసి ఈజీగా మనీ సంపాదించడం కోసం కొత్తదారులు వెతుకుతున్నారు. కార్లను అద్దెకు తీసుకుని, ఫేక్ నంబర్లు, ఆర్సీ తయారు చేసి ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. అదే కారును తస్కరించి, తిరిగి యజమానులకు అప్పగిస్తున్నారు. ఈ ముఠాను మాచారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. – కామారెడ్డి క్రైం

- అద్దెకు తెచ్చి.. ఫేక్ ఆర్సీ, నంబర్ ప్లేట్ తయారు చేసి..
- ఫేస్‌బుక్ ద్వారా తక్కువ ధరకు విక్రయం
- ఆపై అదే కారును చోరీ చేసి.. యజమానికి అప్పగిస్తున్న వైనం
- ముఠా గుట్టురట్టు చేసిన మాచారెడ్డి పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్, పరారీలో మరొకరు
- వివరాలు తెలిపిన ఎస్పీ రాజేశ్ చంద్ర

జిల్లా కేంద్రానికి చెందిన ఉప్పల్వాయి ప్రశాంత్ గౌడ్ ఫేస్‌బుక్ అప్లికేషన్‌లో చూసి సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేశాడు. ఆ మరుసటి రోజు ఓ వ్యక్తి వచ్చి అది తన కారని చెప్పి తీసుకుపోయాడు. కారు విక్రయించిన వ్యక్తులకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన గతనెల 7వ తేదీన మాచారెడ్డి పీఎస్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపగా కొత్త రకం మోసం వెలుగు చూసింది. కొందరు ముఠాగా ఏర్పడి సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలించారు.



నిందితులనుంచి స్వాధీనం చేసుకున్న కార్లు

ముఠాగా ఏర్పడి..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపీనగర్‌కు చెందిన మహమ్మద్ ఇయాజ్, వికారాబాద్‌లోని ఆలంపల్లికి చెందిన మహమ్మద్ జాహీద్ అలీ, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన పృథ్వి జగదీష్, రాచర్ల శివకృష్ణ, వేములవాడకు చెందిన వివేక్, శేరిలింగంపల్లి మండలానికి చెందిన కర్ణకోట సాకేత్, అలీ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు ముందుగా ట్రావెల్స్ సంస్థల నుంచి వ్యక్తిగతంగా ఇచ్చే సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను అద్దెకు తీసుకుంటారు. వాటి నంబర్ ప్లేట్‌లు మార్చేసి నకిలీ ఆర్సీ, ఇతర పత్రాలు సృష్టిస్తారు. అనుమానం రాకుండా నకిలీ ఆర్సీ తయారు చేయడానికి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లలో ఖాళీ మైక్రో సిమ్ కార్డులు, ఖాళీ చిప్ కార్డులను కొంటారు. వాటిపై పేర్లు, వివరాలను ప్రింటింగ్ చేస్తారు. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఇతర పత్రాలన్నీ తయారు చేస్తారు. ఆపై ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో కారు అమ్మకానికి ఉందని పెట్టి, తక్కువ ధరకే వాటిని అమ్మనున్నట్లు పేర్కొంటారు. కారు, చౌక ధరను చూసి ఆకర్షితులైనవారు వారి వలలో చిక్కుతున్నారు.

జీపీఎస్ ట్రాకర్లను అమర్చి..

కారును అమ్మేటప్పుడు దాంట్లో జీపీఎస్ ట్రాకర్‌ను అమరుస్తారు. దీంతో కారు ఎక్కడుందో వారికి తెలిసిపోతుంది. కారున్న చోటుకు వెళ్లి రాత్రికి రాత్రి వారు విక్రయించిన కారునే చోరీ చేసి తీసుకువచ్చి అసలు యజమానికి అప్పగిస్తున్నారు. అలా వీలు కాని సందర్భాల్లో ఇతరులను పంపి కారు మాది అంటూ బెదిరింపులకు పాల్పడి ఎత్తుకొస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని కారు అమ్మిన తర్వాత రెండు నుంచి మూడు రోజుల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు.

నిందితులపై పలు కేసులు..

నిందితులు ఈ విధంగా గతంలోనూ పలు చోట్ల నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. శంకర్‌పల్లి, మంచాల, అంబారిపేట, రామచంద్రాపురం, చందానగర్, మియాపూర్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లలో నిందితులపై పలు కేసులు నడుస్తున్నాయని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. మాచారెడ్డిలో కేసు నమోదైన నాటి నుంచి పరారీలో ఉన్న వారిలో ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారిని బుధవారం రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు అలీ ఇంకా పరారీలో ఉన్నాడన్నారు. నిందితుల వద్ద నుంచి మూడు కార్లు, 15 సెల్‌ఫోన్‌లు, జీపీఎస్ పరికరాలు, ల్యాప్‌టాప్, 10 మైక్రో సిమ్‌కార్డులు, చిప్ కార్డులు, ఫోర్జరీ చేసిన ఆర్సీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన రూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్, ఐటీ సెల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది సుభాష్‌రెడ్డి, సిద్దిరాములు, శ్రీకాంత్‌లను అభినందించారు. సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుకు జన కళ



నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు, తిలకిస్తున్న పర్యాటకులు

- నిజాంసాగర్‌నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- భారీగా తరలివచ్చిన పర్యాటకులు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు జనసంద్రంగా మారింది. ప్రాజెక్టు అందాలను తిలకించడానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టు పరిసరాలు కిక్కిరిసిపోయాయి. బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 65,269 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువ ఉన్న సింగూరు ప్రాజెక్టు 5 గేట్ల ద్వారా 43 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అంతేకాకుండా హల్దీవాగు, పోచారం ప్రాజెక్టు అలుగుల ద్వారా ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 16 గేట్ల ద్వారా 1,00,600 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1,403.25 అడుగుల (15.323 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి

కౌలాస్‌నాలాకు 2,724 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి 2,724 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 2,624 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీ) కాగా.. ప్రస్తుతం 457.65 మీటర్ల (1.152 టీఎంసీ) నీరు నిల్వ ఉందన్నారు.

నిషేధిత ప్రాంతాలకు వెళ్లొద్దు

ప్రమాదాలకు అనువుగా ఉన్న నిషేధిత ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లవద్దని, విహార యాత్ర విషాదానికి కారణం కాకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. వర్షాలు, వరద నీటి ప్రవాహాల సమయంలో లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టును ఎస్పీ సందర్శించారు. పర్యాటకులతో మాట్లాడారు. వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున పర్యాటకులు పోలీసుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అంతకుముందు అచ్చంపేట గెస్ట్‌హౌస్‌లో బాన్సువాడ డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ వెంట బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, రూరల్ సీఐ తిరుపయ్య, బిచ్కుంద సీఐ రవికుమార్, బాన్సువాడ టౌన్ సీఐ అశోక్, స్థానిక ఎస్సై శివకుమార్, సిబ్బంది ఉన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

చెక్‌డ్యాం పైనుంచి వెళ్లొద్దు




తాడ్వాయిలో డ్రోన్ గురించి అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- తాడ్వాయి మండలంలో పర్యటన

తాడ్వాయి: వాటర్ ఓవర్‌ఫ్లో తగ్గేంతవరకు ప్రజలు చెక్‌డ్యాంలపైనుంచి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. ఆయన బుధవారం తాడ్వాయి మండల కేంద్రంతోపాటు సంతాయిపేట్, చిట్యాల గ్రామాలలో పర్యటించారు. సంతాయిపేట్ శివారులోని శ్రీభీమేశ్వరాలయం వద్ద పారుతున్న భీమేశ్వర వాగును పరిశీలించారు. అధికంగా నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు చెక్‌డ్యాంపైకి ఎవరిని వెళ్లనీయొద్దన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. చిట్యాల పాఠశాలలో సీడ్ బాల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విత్తన బంతుల విస్తరణ కార్యకరమాన్ని నిర్వహించారు. గ్రామాలలో కోతుల బెడద పోవాలంటే పండ్ల మొక్కలను పెంచాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తాడ్వాయిలో డ్రోన్ ద్వారా మందులు, ఎరువులను ఎలా పిచికారి చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ మల్లేష్, డీఈవో రాజు, మండల ప్రత్యేకాధికారి శివకుమార్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

నేరాల్లోనూ జతగా..

- సులువుగా డబ్బులు సంపాదించడం కోసం అడ్డదారులు
- పోలీసులకు చిక్కి కటకటాలపాలు
- తాజాగా దారిదోపిడీ కేసులో మరో జంట అరెస్టు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భార్యాభర్తల బంధమంటే కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలవడం.. కొందరు నేరాల్లోనూ జతగా నిలుస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలన్న దుర్బుద్ధితో భర్తకు తోడుగా భార్య నేరంలో భాగస్వామిగా మారుతుండడం విస్మయం కలిగిస్తోంది.

కామారెడ్డి పట్టణంలో ఈనెల 17 న సాయంత్రం సొంతూరుకు బైకుపై వెళ్తున్న వ్యక్తిని ఓ మహిళ లిఫ్ట్ అడిగింది. వారు బైక్‌పై కొద్దిదూరం వెళ్లిన తర్వాత మరో బైకుపై వచ్చిన సదరు మహిళ భర్త వీరిని ఆపాడు. ఆ తర్వాత భార్యాభర్తలిద్దరు కలిసి లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తిపై దాడి చేసి అతడి వద్దనున్న రూ.2 వేలు, సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. ఈ ఘటనలో పోలీసులు భార్యభర్తలను అరెస్టు చేశారు. గతంలో భిక్కనూరు మండలంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన కేసులో మాచారెడ్డి మండలానికి చెందిన భార్యాభర్తలను పోలీసులు కటకటాల వెనక్కి పంపిన విషయం తెలిసిందే. కామారెడ్డిలో మోసానికి పాల్పడిన ఘటనలో ఓ జంట అరెస్టయ్యింది. భార్యాభర్తలిద్దరూ అరెస్టయి జైలుపాలవడంతో వారి పిల్లలు అనాథలు అవుతున్నారు. ఇదే సమయంలో నేరాలకు పాల్పడి చిక్కిన వారిపై ఎప్పటికీ ఆ ముద్ర అలాగే ఉండిపోతుంది. అలాంటి నేరాలు మళ్లీ ఎక్కడ జరిగినా పోలీసులు వారినే అనుమానించే పరిస్థితి ఎదురవుతుంది.

తప్పించుకోలేరు...

నేరం చేసిన వారు తప్పించుకునే పరిస్థితులు ఉండవు. ఎందుకంటే టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. అడుగడుగునా సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ నెట్‌వర్క్ నేరస్తులను పట్టిస్తున్నాయి. వేలిముద్రల ఆధారంగా నేరస్తులు ఎవరో తెలిసిపోతోంది. ఏదో ఒక సాంకేతిక ఆధారాన్ని సాక్ష్యంగా చూపి నేరస్తులను అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారు. నేరం చేసి దూరానికి పారిపోయినా సరే దొరికిపోతున్నారు.

వారించాల్సిందిపోయి...

భార్యాభర్తల్లో ఎవరో ఒకరు తప్పుదారిలో వెళ్తే వారించి సరైన మార్గంలో పెట్టాల్సిన వారే తప్పుడు పనులకు, అది కూడా నేరాలకు తోడుగా నిలుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో పలు సంఘటనల్లో భార్య, భర్తలు భాగమవుతున్న కేసులు వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య భూములు, ఆస్తుల గొడవల్లో జరిగే దాడులు, హత్యల్లోనూ భార్యభర్తలు భాగమై కేసుల్లో జైలుకు వెళుతున్నారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం గ్రామంలో అన్నదమ్ముల మధ్య ఉన్న ఆస్తి వివాదంలో జరిగిన హత్య కేసులో భార్యభర్తలు అరెస్టయ్యారు. మరికొన్ని కేసుల్లోనూ భార్యభర్తలు అరెస్టయిన ఉదంతాలున్నాయి. పిల్లల కిడ్నాప్ సంఘటనల్లోనూ గతంలో ఓ జంట అరెస్టయ్యింది. ఈజీ మనీ కోసం ఇలా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పెండింగ్‌లోనే సీఎంఆర్

- సీరియస్‌గా తీసుకోని అధికారులు
- గతంలో మంత్రి జూపల్లి, ప్రస్తుత మంత్రి సీతక్క ఆదేశించినా ఫలితం శూన్యం
- నిజామాబాద్ జిల్లాలో రూ.250 కోట్లు, కామారెడ్డి జిల్లాలో రూ.45 కోట్ల విలువైన సీఎంఆర్ పెండింగ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ధాన్యం పండించడంలో, ధాన్యం సేకరణలోనూ జిల్లా నంబర్ వన్‌గా నిలిచింది. అదేవిధంగా సీఎంఆర్ రికవరీని పెండింగ్ పెట్టడంలోనూ మొదటి స్థానంలోనే నిలబెట్టడంపై జిల్లా యంత్రాంగంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న సీతక్క సీఎంఆర్ రికవరీ విషయంలో చర్యలకు దిగాలని ఉమ్మడి జిల్లా అధికారులను ఆదేశించినా ఫలితం లేదు.

■ 2014–15 నుంచి 2022–23 సంవత్సరాలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో 44 మిల్లుల నుంచి రూ.250 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 49 మిల్లుల నుంచి రూ.45 కోట్ల విలువజేసే సీఎంఆర్ రికవరీ చేయాల్సి ఉంది. ఇందులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ నుంచి రావాల్సిందే రూ.60 కోట్లు. ఇందుకు సంబంధించి గతంలో సమీక్షలో మంత్రి జూపల్లి ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లవుతున్నా రికవరీ చేయకుండా నోటీసులిచ్చి వదిలేయడమేమిటంటూ అసహనం వ్యక్తం చేశారు. యాక్షన్ ప్లాన్ రూపొందించి కేసుల మీద కేసులు పెట్టి తక్షణమే రికవరీ చేయాలని ఆదేశించారు. యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని అడ్వొకేట్ జనరల్‌తో కలిసి హైదరాబాద్‌లో సమీక్షకు రావాలని ఆదేశించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు.

■ 2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్లకుగాను షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే మిల్లుల పేరిట 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఈ మిల్లుల్లో ఒక్క గింజ కూడా మిల్లింగ్ చేయలేదు. నేరుగా ధాన్యాన్ని అక్రమ మార్గంలో ముంబయి, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నాడు. 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఇచ్చేంత పరిమాణంలో రీసైకిల్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇచ్చాడు. 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రం ఏఆర్ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఆర్‌కాం ఇండస్ట్రీస్ (వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ (బోధన్) వాళ్లకు ఇచ్చినట్లు చూపించాడు. ఈ నాలుగు మిల్లుల యజమానులతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బలవంతంగా ధాన్యం తీసుకున్నట్లు లేఖలు ఇప్పించాడు. షకీల్ ఒత్తిడితోనే లేఖలు ఇచ్చినట్లు సదరు మిల్లర్లు తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే ధాన్యానికి బియ్యం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం షకీల్‌కు చెందిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా వేసింది. ఇప్పటివరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వకపోవడంతో పాటు, జరిమానా సైతం కట్టలేదు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చామని చెబుతూ కాలం గడిపారు. మరోవైపు బాధితుడు కిషోర్ సంతకాన్ని ఫోర్జరీ చేసే కథ నడిపిన అధికారులే, సీఎంఆర్ సైతం కిషోరే ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడం గమనార్హం. అయితే జిల్లా ఇన్‌చార్జి మంత్రులుగా వచ్చిన జూపల్లి, సీతక్క అధికారిక సమీక్ష సమావేశాల్లో ఆదేశించినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఈ విషయమై అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్ చేయగా స్పందించలేదు.

కేసులకే పరిమితం

సీఎంఆర్ రికవరీలో ఉన్నతాధికారులే అధికార దుర్వినియోగానికి పాల్పడిన వ్యవహారంలో గత మార్చి 30న బాధితుడి పోరాటంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న, గతంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్, మాజీ డీఎస్‌వో చంద్రప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్‌రాజ్‌లపై వర్ని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 2022–23 సీజన్‌లో వర్ని మండలంలోని కిషోర్ అనే వ్యక్తికి చెందిన శ్రీనివాస రైస్‌మిల్లుకు కేటాయించిన ధాన్యం పంపించకుండానే పంపించినట్లు చూపి ఉన్నతాధికారులే, సదరు రైస్‌మిల్లు యజమాని సంతకాన్ని సైతం ఫోర్జరీ చేయించారు. ధాన్యం మాత్రం మాజీ ఎమ్మెల్యే షకీల్ మిల్లుకు పంపించి, సీఎంఆర్‌ను కిషోర్‌కు చెందిన మిల్లు నుంచి ఇవ్వాలని ఒత్తిడి తేవడం గమనార్హం. దీంతో దిక్కుతోచని బాధితుడు కిషోర్ నెలల తరబడి న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది. చివరకు హైకోర్టు ఆదేశాలతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసినప్పటికీ, తదుపరి విచారణ, చర్యలు తీసుకోవడంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటివరకు ఒక్కసారి కూడా సదరు అధికారులను పోలీసులు ప్రశ్నించకపోవడం విశేషం.

వైన్‌షాప్‌లకు నోటిఫికేషన్!

- దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంపు
- జిల్లాలో 49 మద్యం దుకాణాలు.. త్వరలోనే షెడ్యూల్ వచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ నెలాఖరు వరకు లైసెన్సులు జారీ చేయనున్నారు. దీనికోసం దరఖాస్తుల స్వీకరణ, లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు ప్రక్రియను నిర్వహించనున్నారు. దానికి సంబంధించిన షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది. 2023లో జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు లైసెన్స్‌ల జారీ కోసం టెండర్లు ఆహ్వానించారు. 2,200 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.44 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడానికి ఈసారి దరఖాస్తు ఫీజును పెంచింది. గతంలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండగా.. ఇప్పుడు దానిని రూ.3 లక్షలు చేసింది.

మద్యం వ్యాపారంపై దృష్టి..

రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్స్ రంగాలు దెబ్బతినడంతో చాలామంది మద్యం వ్యాపారంపై ఆసక్తి చూపుతున్నారు. సిండికేట్లుగా, గ్రూపులుగా వివిధ వ్యాపారాల్లో భాగస్వాములుగా ఉన్న వారు సైతం మద్యం వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. కొందరికి మద్యం వ్యాపారం కలిసిరావడంతో ఈసారి కూడా దందాలో వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. మద్యం అమ్మకాలు ఏడాదికేడాది పెరుగుతుండడంతో దందాపై కొత్తవారు కూడా ఆసక్తితో ఉన్నారు. గతంలో మద్యం దుకాణాల్లో 15 శాతం గౌడ కులస్తులకు, 10 శాతం ఎస్సీలకు, ఐదు శాతం ఎస్టీలకు కేటాయించారు. ఈసారి కూడా అదే విధానాన్ని అమలు చేయనున్నారు.

జోరుగా చర్చ..

ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలియడంతో వ్యాపారుల్లో చర్చ మొదలయ్యింది. ఇప్పటికే మద్యం వ్యాపారంలో ఉన్న వారు, గతంలో మద్యం వ్యాపారం చేసిన వారితో పాటు కొత్తగా ఈ దందాలోకి రావాలనుకుంటున్నవారు నోటిఫికేషన్ గురించి చర్చించుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు మరికొన్ని రోజులు వాయిదా పడితే వైన్‌షాపులకు పోటీ ఎక్కువ ఉండే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మండల, జిల్లా పరిషత్, మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే మద్యం అమ్మకాలు పెద్ద మొత్తంలో జరుగుతాయి. డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటే మాత్రం పోటీ మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ ఈ రెండుమూడు నెలల్లో ఎన్నికలు జరిగితే పోటీ తక్కువ ఉండవచ్చని భావిస్తున్నారు.

తండాలపై డెంగీ పంజా..!

- సోమారంపేటలో 20 మందికి పాజిటివ్
- ప్రయివేట్ ఆస్పత్రులలో చేరుతున్న బాధితులు

మాచారెడ్డి: గిరిజన తండాలపై డెంగీ పంజా విసురుతోంది. చాలా మంది జ్వరపీడితులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని సోమారంపేట, ఎల్లంపేట, బంజపల్లి, సర్దాపూర్ తండాల్లో గిరిపుత్రులు జ్వరాల బారినపడి మంచం పట్టారు. ఒక్క సోమారంపేట గ్రామంలోనే 20 మందికి డెంగీ సోకి ప్రైవేట్ ఆస్పత్రులలో చేరినట్లు ఆయా గ్రామాల ప్రజలు సాక్షికి తెలిపారు. ఇటీవల పాల్వంచ మండలం భవానిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కిసాన్ నగర్‌లో దాదాపు 25 మందికి డెంగీ సోకింది. మాచారెడ్డి వైద్యాధికారి అదర్శ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్యం అందించారు.

ఓ మహిళకు సీరియస్

మండలంలోని గజ్యా నాయక్ తండాకు చెందిన ఓ మహిళకు డెంగీ సోకి పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల అనంతరం కోలుకొని ఇంటికి చేరింది.


సోమారంపేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం(ఫైల్)

అదుపులోకి వచ్చాయి



మండలంలోని పలు గ్రామా ల్లో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. సోమారంపేటలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుతం జ్వరాలు అదుపులోకి వచ్చాయి. అయినా మా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్నారు.

–ఆదర్శ్, వైద్యాధికారి, మాచారెడ్డి

క్లుప్తంగా

ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ తనిఖీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ ఆకస్మికంగా ఆర్డీవో పార్థసింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థుల వాష్‌రూంలు, లైబ్రరీ, ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు సక్రమంగా బోధిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా అని అడిగారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్ గాంధీ, ఉపాధ్యాయులు జహంగీర్, రాజశేఖర్, లక్ష్మణ్‌సింగ్, బల్వంత్‌రావు, విద్యారమణ తదితరులున్నారు.

రేపు ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫర్నిచర్‌కు వేలం పాట

కామారెడ్డి క్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాడకంలో లేని ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫర్నిచర్, ఇతర వస్తువులకు శుక్రవారం(22న) జిల్లా పోలీస్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో చెడిపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, కంప్యూటర్ సామగ్రి, జిరాక్స్ మిషన్లు, టెంట్‌లు, షామియానాలు, ఫర్నిచర్, ఇనుప వస్తువులను వేలం ద్వారా విక్రయించనున్నామని వెల్లడించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకల్లా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి పేర్లు నమోదు చేసుకుని వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలం ముగిసిన వెంటనే డబ్బులు చెల్లించి వస్తువులు తీసుకువెళ్లాలని సూచించారు. సందేహాలకు 87126 86115(ఆర్ఎస్సై చంద్రశేఖర్), 87125 25970 (ఏఆర్ కానిస్టేబుల్ అంకుష్)లను సంప్రదించాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విద్యార్థులకు చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల నిధులను విడుదల చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి గోపాల్ సింగ్ ఠాగూర్ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు శివ, కార్యదర్శి సునీల్, నాయకులు సూర్యపాల్, తరుణ్ తదితరులున్నారు.

కొనసాగుతున్న పీజీ, బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం ఏడు పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 2,366 మంది విద్యార్థులకు 2,240 మంది హాజరుకాగా 126 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన బీఈడీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 1,444 మంది విద్యార్థులకు 1,379 మంది హాజరుకాగా 65 మంది గైర్హాజరైనట్లు చంద్రశేఖర్ తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


బంజర సమీపంలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మంజీరా నీటితో ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం చెల్లించి ఆదుకుంటామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. చీనూర్, బంజర, వెంకంపల్లి తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి నీట మునిగిన పంటలను ఆయన పరిశీలించారు. ముంపునకు గురైన పంటల వివరాలను స్థానిక అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. సింగూర్ ప్రాజెక్టు నుంచి భారీగా వరదనీరు దిగువకు విడుదల కావడం వల్ల నాగిరెడ్డిపేట మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో సుమారు 1,500 నుంచి 2000 ఎకరాలు నీటమునిగాయన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో సింగూర్ జలాలతో పంటలు ముంపునకు గురవుతున్న విషయం తెలుసుకున్న తాను ఆదివారం రాత్రి నుంచి జుక్కల్ ఎమ్మెల్యేతోపాటు నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను పైకి ఎత్తించామని చెప్పారు. సర్వే చేయించి వివరాలను సేకరిస్తామన్నారు. సింగూర్ నుంచి నీరు విడుదలైన ప్రతిసారీ పంటలు మునుగుతున్న నేపథ్యంలో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా మంజీరనదిలో తుమ్మచెట్లను తొలగింపజేసేలా నీటిపారుదలశాఖ అధికారులు రూ.1.2 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారన్నారు. ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, నీటిపారుదలశాఖ డీఈఈ వెంకటేశ్వర్లు, నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు విక్రాంత్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సుధాకర్, కిష్టయ్య, తదితరులున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


అంతంపల్లి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో రాజగంగారెడ్డి

భిక్కనూరు: ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని భిక్కనూరు ఎంఈవో రాజగంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన అంతంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా విద్యను బోధించాలని చెప్పారు.


చుక్కాపూర్‌లో.. ఎంఈవో దేవేందర్‌రావు

సామర్థ్యాలను పెంపొందించాలి

మాచారెడ్డి: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని మాచారెడ్డి ఎంఈవో దేవేందర్‌రావు అన్నారు. టీఎల్ఎం మేళాలో భాగంగా గురువారం ఆయన చుక్కాపూర్‌లో మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన ప్రణాళిక ప్రకారం విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు వెంకటాచారి, గోవర్ధన్‌రెడ్డి, హెచ్ఎం మాన్‌సింగ్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట గ్రామానికి చెందిన ఉద్యమారి నాగలక్ష్మి ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ కుమార్, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ్ చేతుల మీదుగా నాగలక్ష్మి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. హిస్టరీ విభాగంలో స్త్రీ సాధికారతపై బౌద్ధ దృక్పథం అనే అంశంపై నాగలక్ష్మి రీసెర్చ్ చేశారు. నాగలక్ష్మి ప్రస్తుతం పురాతత్వ శాఖ కార్యాలయంలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు.

బీర్కూర్‌కు చెందిన ఉపాధ్యాయుడికి..



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ అఫ్రోజ్ అనే ఉపాధ్యాయుడు బుధవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ షీలా మిశ్రా చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సమకాలీన హిందీ చలనచిత్రాల్లో వృద్ధుల ప్రతిబింబం అనే అంశంపై ఆయన విశేష పరిశోధన చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ షీలా మిశ్రా, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, ఇస్రో చైర్మన్ నారాయణన్‌ల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా అఫ్రోజ్ మాట్లాడుతూ..తన విజయం వెనుక గురువులు, మిత్రులు, కుటుంబ సభ్యులు ఉన్నారని..వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలని అన్నారు.

గంగామాత ఆలయ వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగామాత ఆలయ ఐదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశివారులోని ఊరచెరువు వద్ద గల గంగామాత ఆలయం పురోహితుడు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

బాన్సువాడ రూరల్: మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలను బ్యాడ్‌టచ్ చేస్తూ వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు కొన్నిరోజులుగా శారీరకంగా వేధిస్తుండంతో విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా అధికారి స్రవంతి, బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావులు బుధవారం పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు నిర్ధారించి పోలీసులు, ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో బాన్సువాడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలే ఈ పాఠశాలలో జరిగిన కంప్యూటర్ల చోరీలోనూ సదరు ఉపాధ్యాయుడి హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

ఒకరి మృతికి కారణమైన నిందితుడికి 9 నెలల జైలు

కామారెడ్డి క్రైం: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన నిందితుడికి కామారెడ్డి కోర్టు 9 నెలల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్‌కు చెందిన జమ్మిగాని పోట్ల ముత్తాగౌడ్ తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా బోయిని స్వామి అనే వ్యక్తి తన ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ముత్తా గౌడ్ మరుసటి రోజు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ స్వామిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సాక్ష్యాలను పరిశీలించిన ప్రత్యేక మొబైల్ కోర్టు 2024 ఏప్రిల్ 4 న నిందితుడికి 9 నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అనంతరం నిందితుడు జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకున్నాడు. బుధవారం కేసును పరిశీలించిన జిల్లా జడ్జి వరప్రసాద్ గతేడాది ప్రత్యేక మొబైల్ కోర్టు ఇచ్చిన తీర్పు సరైనదేనని భావిస్తూ తీర్పునిచ్చారు. కేసును సరైన పద్ధతిలో విచారణ చేసి పకడ్బందీ ఆధారాలతో కోర్టులో అభియోగపత్రం వేసి నిందితునికి శిక్షపడేలా కృషి చేసిన ఎస్సై రాజు, పోలీసుఅధికారులను ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

వాగుల పరిశీలన


వాగు వద్ద ఎంపీడీవో గంగాధర్ తదితరులు

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట, మర్పల్లి, లింగంపల్లి, ఆరేడ్ గ్రామాల పరిధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను బుధవారం స్థానిక ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పాటు నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులు, వరదల వల్ల వంతెనలు నీటమునగడంతో ఆ రోడ్లపై ప్రయాణం చేయవద్దని ఆయా గ్రామాల ప్రజలకు ఎంపీడీవో సూచించారు. జీపీ కార్యదర్శి తుకారాం తదితరులున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


మర్కల్‌లో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్, మర్కల్ గ్రామాల్లో గల బీటీ రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధర్మారావ్‌పేట్ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీగా గుంతలు పడటంతో ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు దృష్టి సారించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో పాల్వంచ వాసి మృతి


వెంకటి మృతదేహం

మాచారెడ్డి: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం పాల్వంచ మర్రి గ్రామానికి చెందిన కడమంచి వెంకటి(57)మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటి తన బైక్‌పై పని మీద సిరిసిల్ల జిల్లా సముద్ర లింగాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా పెద్దమ్మ స్టేజి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారుడ్రైవర్ అతివేగంతో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు వెంకటి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారు.

అదృశ్యమైన మహిళ శవం లభ్యం


చిన్నక్క(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడికిందిపల్లెకు చెందిన ఇరగదిండ్ల చిన్నక్క(42) మృత దేహం లభ్యమైనట్లు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. ఈ నెల 5న చిన్నక్క అదృశ్యమైనట్లు కుటుంబసభ్యు లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చే శామన్నారు. బుధవారం రాంపల్లి అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం వ చ్చిందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మహిళ మృతదేహం కుళ్లిపోయినట్లు తెలిపారు. మృతురాలిని హత్య చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తూ విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. చెన్నయ్యగారి మల్లాగౌడ్‌కు చెందిన ఆవు వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ స్టార్టర్ బాక్స్ తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్తులు ఆవు మృతి విషయాన్ని విద్యుత్ అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలిపారు.

ఆగస్టులోనే పూసే 'అగ్ని శిఖ' పుష్పం

మీకు తెలుసా?

వేసవిలో పూసే 'మే' పుష్పం మాదిరిగా ఆగస్టు మాసంలోనే పూసే మరో రకం పుష్పం ఉంది. దాని పేరే అగ్ని శిఖ (కలంగటి పువ్వు). దీనికి 'గ్లోరీ లిల్లీ' అనే మరో శాస్త్రీయ నామం కూడా ఉంది. ఇది 'కొల్చికేసియే' అనే కుటుంబానికి చెందిన మొక్క. మొత్తం 11 రకాల జాతుల్లో 'అగ్ని శిఖ' ఒకటి.

- ఇది భారతదేశంతోపాటు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల్లో అలాగే సముద్రపు, అటవీ ప్రాంతాలు, చెట్ల పొదల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి వర్షాకాలంలో రుతుపవనాలకు అనుకూలంగా ఉండి పుష్పాలు పూస్తాయి.
- ఇది తమిళనాడు రాష్ట్ర పుష్పం కూడా. మొక్క మూడు మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. దీని పూలు ఆకుపచ్చ, పసుపు, నారింజ, ఎరుపు, ముదురు గులాబీ రంగుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- వినాయక చవితి పండుగకు ముందు ఇవి భారీగా వికసిస్తాయి. అందుకే వీటిని 'ఎంకయ్య పువ్వు' అని కూడా అంటారు. చవితి రోజు గణపతిని ఈ పుష్పాలతో ప్రత్యేకంగా పూజిస్తారు. ఎడ్ల పొలాల అమావాస్య నాడు కూడా వీటిని రైతులు పూజకు ఉపయోగిస్తారు. ఇలా చేయడం పెద్దల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది.


దత్తాపూర్ శివారులో పూసిన అగ్ని శిఖ పుష్పాలు

- పవిత్రంగా భావించే ఈ మొక్కను విషపూరితమైనదిగా పరిగణిస్తారు. మనుషులు, పశువులు తినకూడదంటారు. కానీ, దీనిని ఆర్థరైటిస్, అల్సర్, కు ష్ఠు, పైల్స్, కడుపునొప్పి, చర్మ సంబంధిత, ఇత ర చాలా రకాల వ్యాధులకు ఉపయోగిస్తారట.

– దొంకేశ్వర్(ఆర్మూర్)

పీఆర్‌టీయూ మహాధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


బీర్కూర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్


మాచారెడ్డిలో..


మహమ్మద్‌నగర్‌లో..

సాక్షి నెట్‌వర్క్:పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం బీర్కూర్, మాచారెడ్డి, మహమ్మద్‌నగర్, బీబీపేట, ఎల్లారెడ్డి మండలాలల్లో పీఆర్‌టీయూ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు కోరుతూ తలపెట్టిన మహాధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు.


బీబీపేటలో..


ఎల్లారెడ్డిలో ..

ఆధ్యాత్మికం

ఘనంగా సంత్ సేనా మహారాజ్ ఉత్సవం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మల్లేశ్వర మందిరంలో బుధవారం నాయీబ్రాహ్మణుల ఆరాధ్య దైవం సంత్ సేనా మహరాజ్ ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్కారీలు సంత్ సేనా మహారాజ్ పండరీపురం విఠలేశ్వర భక్తులని, భక్తి మార్గంలో ఉంటూ జీవితం కొనసాగించాలని అన్నారు. భక్తులు మరాఠీ కీర్తనలు, భజనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం మహిళలు, భక్తులు కలశాలతో, విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్తం

'విగ్రహాల తరలింపులో జాగ్రత్తలు పాటించాలి'



కామారెడ్డి అర్బన్:వినాయక విగ్రహాల తరలింపులో మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీ సుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప లు ప్రాంతాల్లో పర్యటించారు. సిబ్బందికి పలు సూ చనలు ఇచ్చారు.పది ఫీట్ల కంటే ఎత్తున్న గణేష్ విగ్రహాలను తరలించే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు.మండపాల నిర్వహకులు ముందుగా విద్యుత్ అధికారులకు సమాచారం ఇస్తే తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ వైర్లపై చిందరవందరగా ఉన్న కేబుల్ వైర్లను సరిచేసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నిజాంసాగర్(జుక్కల్): ఆరేడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు యాటకారి నారాయణను బుధవారం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పరామర్శించారు. కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయణ డిశ్చార్జి అయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆరేడ్ గ్రామానికి వచ్చి నాయకుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప

కామారెడ్డి టౌన్: మండలంలోని తిమ్మక్‌పల్లి, ఇస్రోజీవాడి గ్రామంలో పలువురిని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బుధవారం పరామర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్త సాయిలు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి భార్య ఇంద్రకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే బక్క మల్లయ్య, దుబ్బాక ఎల్లవ్వ, సాకలి లక్ష్మిలు చనిపోవడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. అలాగే తిమ్మకపల్లిలో ఇటీవల మృతి చెందిన కవలలు రామ, లక్ష్మణ్‌ల కుటుంబాన్ని పరామర్శించి వారి తండ్రి నర్సింలుకు ఆర్థిక సాయం అందజేశారు. గొల్ల గంగయ్య, జిల్లేడు లక్ష్మి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గూడెం బాలరాజ్, మాజీ సర్పంచ్‌లు రాజు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోచయ్య, ఉపాధ్యక్షుడిగా గన్నారం అల్లూరి, ప్రధాన కార్యదర్శిగా మాసాని సాయిలు, కోశాధికారిగా సాయిలు, ప్రధాన సలహాదారుగా లేగ్గల రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం మండల అధ్యక్షుడు పోచయ్య మాట్లాడారు. ఈ నెల 23న ఎల్లారెడ్డి మండల కేంద్రానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు తెలిపారు. నేతలు నెల్లూరి గంగారాం, ద్యామని భూపతి, ఆశయ్య, రాజు, ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీమా డబ్బుల కోసం కన్న తల్లి దారుణ హత్య

- ఏడు నెలల తర్వాత వెలుగు చూసిన ఘటన

నాగిరెడ్డిపేట (ఎల్లారెడ్డి): బీమా డబ్బుల కోసం కన్న కొడుకే తల్లిని హతమార్చిన ఘటన సుమారు ఏడు నెలల తర్వాత వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలను నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ బుధవారం రాత్రి మీడియాకు తెలిపారు. జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన చాకలి రాజు తన తల్లి జమునను గత జనవరి 9న హతమార్చాడు. జమున బహిర్భూమి కోసం ఆరుబయటకు వెళ్లగా రాజు వెనక నుంచి వెళ్లి బండరాయిపై తోసి తలకు గాయం చేసి హతమార్చాడు. జమున బహిర్భూమికి వెళ్లి కాలుజారి బండపైపడి మృతి చెందినట్లు గ్రామస్తులను, పోలీసులను నమ్మించాడు. ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్‌గేట్ వద్ద జరిగిన ఓ హత్యాయత్నం కేసులో చాకలి రాజుతో పాటు ఓ మహిళ, మరో ఇద్దరు నిందితులు, మైనర్ బాలుడిని గత నెల 29న పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యాయత్నం కేసుకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం చాకలి రాజు తోపాటు మహిళ, ఇద్దరు నిందితులను ఈ నెల 18న పోలీసులు పీటీ వారెంట్‌పై కస్టడీలోకి తీసుకొని విచారించారు. పోలీసులు చేపట్టిన విచారణలో చాకలి రాజు తల్లి జమున హత్య విషయం బయట పడింది. జమున పేరుమీద రాజు రూ.80 లక్షల విలువ చేసే 6 ఇన్సూరెన్స్ పాలసీలు చేయించాడు. తల్లి పేరున ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులను కాజేసేందుకు హత్య చేసినట్లు రాజు విచారణలో అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చామని ఆయన చెప్పారు.